క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

రాయికల్: మండలంలోని వస్తాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం గ్రామానికి చెందిన నాయకులు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

పెండింగ్ బిల్లులు, డీఏ మంజూరు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

జగిత్యాలటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు, డీఏ మంజూరు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని గీత గ్రంథాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, సప్లిమెంటరీ వేతనాల బిల్లు ఏడాది దాటినా మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర సహ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రామారావు, ప్రధాన కార్యదర్శి ప్రసాదరావు, రాజేంద్రప్రసాద్, పూర్ణచందర్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలపై దీక్ష


మాట్లాడుతున్న పుప్పాల శ్రీకాంత్

జగిత్యాలటౌన్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై నవంబర్ 5,6 తేదీల్లో నిర్వహించబోయే 48 గంటల దీక్షను విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికుల శ్రమతోనే గ్రామాలు సస్యశ్యామలంగా ఉన్నాయన్నారు. శ్రమకు తగిన వేతనం చెల్లించడంతో పాటు పెండింగు వేతనాలు వెంటనే చెల్లించాల్సిందిగా కోరారు. సమావేశంలో జీపీ ఎంప్లాయిస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి మల్లేశం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గర్వందుల రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సురేశ్, కార్మికులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడలకు అంబారిపేట విద్యార్థి ఎంపిక


విద్యార్థితో పీడీ రాజేశ్

కథలాపూర్: మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనగందుల రాజశేఖర్ అథ్లెటిక్స్ విభాగంలో జోనల్ స్థాయి క్రీడలకు ఎంపికై నట్లు పీడీ రాజేశ్ ఆదివారం తెలిపారు. జగిత్యాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో 100 మీటర్ల పరుగుపందెంలో రాణించారన్నారు. జోనల్ స్థాయి క్రీడలకు ఎంపికైన రాజశేఖర్‌ను పీడీ రాజేశ్, హెచ్ఎం కిషన్‌రావు అభినందించారు.

నాగులపేటలో ఉచిత వైద్య శిబిరం

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేటలో రాక్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, 2డీ ఎకో పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేతిరెడ్డి భాస్కర్ రెడ్డి, నారాయణ రెడ్డి, శేఖర్ రెడ్డి, గంగారెడ్డి, రాక్ స్టార్ యూత్ సభ్యులు సాయి, రాకేశ్, మానిధర్, పాల్గొన్నారు.

మున్సిపల్ భవనం పూర్తయ్యేదెప్పుడో ?

- మరో మూడు నెలల్లో ముగియనున్న పాలకవర్గ పదవీకాలం
- కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపు
- నత్తనడకన సాగుతున్న పనులు
- నెలకు రూ.16 వేలు అద్దె చెల్లింపు


నిలిచిన మున్సిపల్ భవన నిర్మాణ పనులు



అద్దె భవనంలో మున్సిపల్ భవనం

రాయికల్: రాయికల్ మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత నూతన భవనంలోకి పాలకవర్గం సభ్యులు వెళ్లాలనే ఆశ కలగానే మిగులుతోంది. కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించినప్పటికీ పనులు చెల్లించకపోవడంతో మున్సిపల్ భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రాయికల్ మున్సిపల్ భవన నిర్మాణం కోసం 2023 సెప్టెంబర్ లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆరునెలల్లోపు జీ ప్లస్ 2 మున్సిపల్ భవనాన్ని నిర్మించాల్సి ఉండగా, కాంట్రాక్టర్‌కు కేవలం మొదటి స్లాబ్ వరకే పనులు చేసి బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మున్సిపల్ భవనం కోసం తాత్కాలికంగా అద్దెకు తీసుకుని నెలకు రూ.16 వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. పట్టణానికి దూరంగా ఉండటంతో పట్టణ ప్రజలు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకువచ్చి పాలకవర్గం ముగిసేలోపు మున్సిపల్ భవనం పూర్తి చేసేలా చూడాలని పాలకవర్గ సభ్యులు, పట్టణ కోరుతున్నారు.

నాసిరకపు పనులు

రాయికల్ మున్సిపల్ జీ+2 పనుల్లో సైతం నాణ్యత లోపిస్తోంది. పలుమార్లు సంబంధిత కాంట్రాక్టర్‌ను నాణ్యతగా చేపట్టాలని కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్, చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించి భవన నిర్మాణ పనులు నాణ్యతగా, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌కు బిల్లులు వచ్చాయి



రాయికల్ మున్సిపల్ భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లులు కాంట్రాక్టర్‌కు ఇటీవలే వచ్చాయి. మున్సిపల్ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం. నాణ్యతపై ఎలాంటి రాజీపడాల్సిన పరిస్థితి లేదు.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

మున్నూరుకాపుల సంక్షేమం, అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


నూతన కార్యవర్గంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: మున్నూరు కాపుల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీర్‌పూర్ మండల కేంద్రంలో మండల నూతన కార్యవర్గం ఎన్నికైన సభ్యులను ఆయన అభినందించిన అనంతరం మాట్లాడుతూ మున్నూరుకాపులు వ్యవసాయ రంగంలో అగ్రభాగాన నిలుస్తున్నారన్నారు. విద్యా, వ్యాపార, రాజకీయ రంగాల్లోను ప్రథమ స్థానాల్లో నిల్వడం సంతోషంగా ఉందన్నారు. బీర్‌పూర్ మండలంలో మున్నూరుకాపుల కోసం రూ. 20 లక్షలతో మున్నూరు కాపుల కల్యాణ మండప నిర్మాణంకు ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరుకు కృషిచేస్తానన్నారు. మున్నూరు కాపు బీర్‌పూర్ మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చిర్నేని రాజశేఖర్‌ను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, సైండ్ల శ్రీనివాస్, జగిశెట్టి శ్రీనివాస్, చిర్నేని శ్రీనివాస్, మసర్తి శేఖర్, చల్ల లక్ష్మణ్, చల్ల రాములు, తాటి గంగన్న ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి

రాయికల్: మండలంలోని చెర్లకొండాపూర్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆదివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని చెర్లకొండాపూర్ గ్రామస్తులు, ఫాతిమా నగర్ ఆడోరేషన్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ మద్రి మల్లేశంతో కలిశారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పల్లికొండ రమేశ్, ఆకుల రాజేందర్, లక్ష్మీనారాయణ, నానం రాజేందర్,తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొండగట్టు: రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. గతంలో తూకం వేసిన విధంగా బస్తాకు తరుగు పేరుతో కిలో, రెండు కిలోలు అదనపు తూకం వేస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. శుద్ధి చేసిన ధాన్యాన్ని ఎలాంటి అదనపు తూకం లేకుండా అధికారులు కొనుగోలు చేయాలన్నారు. మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామన్నారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు వస్తే తనకు ఫోన్ చేయాలన్నారు. బీఆర్ఎస్, బిజెపి పార్టీలు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ గౌడ్ ,జీవన్ రెడ్డి, రాజనరసింగరావు, పిడుగు ప్రభాకర్ రెడ్డి, నారాయణ, శ్రీనివాస్, కదారి మల్లేశం, గడ్డం చంద్రమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా.. నిర్మాణానికి నోచుకోలే


వాటర్ ప్లాంట్‌లో పంచాయతీ కార్యాలయం

పెగడపల్లి:మండలంలోని నామాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి గ్రహణం పట్టింది. ఇక్కడ ఉన్న గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించారు. ఈజీఎస్ నుంచి రూ. 20 లక్షలు నూతన భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో మంజూరయ్యాయి. ఈ మేరకు భవన నిర్మాణ పనులు ప్రారంభించి వదిలేశారు. ప్రస్తుతం పంచాయతీ భవనం లేక స్థానికంగా ఉన్న వాటర్‌ప్లాంట్‌లో ఓ పక్క జీపీ కార్యాలయంగా ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ప్రత్యేక అధికారి పాలనలో పాలన పరమైన కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. సభలు, సమావేశాలు నిర్వహించేందుకు జీపీ భవనం లేక అటు సిబ్బంది, ఇటు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిధులు సరిపడా ఉన్నా.. జీపీ భవన నిర్మాణం ముందుకు సాగకపోవడం పట్ల గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్, సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


మల్లాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


కోరుట్లలో బీఆర్ఎస్ నాయకుల నిరసన


మెట్‌పల్లిలో..


రాయికల్‌లో..


బీర్‌పూర్‌లో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన


కథలాపూర్‌లో..


పెగడపల్లిలో..

రైతు భరోసాపై బీఆర్ఎస్ నిరసన

కోరుట్లరూరల్/మెట్‌పల్లి/రాయికల్/ఇబ్రహీంపట్నం/కథలాపూర్/సారంగాపూర్/మల్యాల/పెగడపల్లి/మల్లాపూర్/మేడిపల్లి: రైతులకు రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. ఆయా రహదారులపై ధర్నా, రాస్తారోకోలు చేపట్టారు. రైతు భరోసా నిధులు, రైతులందరికీ రూ. 2 లక్షల పంట రుణమాఫీ నిధులు వెంటనే విడుదల చేయాలని,అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించా లని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతీ హామీని అమలుపరచాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మేడిపల్లిలో జాతీయ రహదారిపై బైఠాయించిన నాయకులు

వర్గీకరణ అమలు చేయకుండా నియామకాలు చేపట్టొద్దు


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సారంగాపూర్: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడం సరి కాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రమేష్ మాదిగ అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో ఆదివారం మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మొట్టమొదటిగా తెలంగాణలో అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కమిటీల పేరుతో మోసం చేస్తున్నారని విమర్శించారు. సీఎం వైఖరికి నిరసనగా ఈ నెల 27 జగిత్యాల మాదిగల ధర్మయుద్ధ మహాసభను నిర్వహిస్తున్నామని, సభకు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని, మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షుడు నక్క సతీష్‌మాదిగ, పోడేటి సునీల్, దొబ్బల వేణుగోపాల్, సంగెపు ముత్తు, మేకల శేఖర్, గంగారాజం తదితరులు పాల్గొన్నారు.

'విద్యాసాగర్ హయాంలోనే ఆలయాలకు నిధులు'

రాయికల్: కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ విద్యాసాగర్ రావు హయాంలోనే ఆలయాలకు నిధులు మంజూరయ్యాయని వాటితో నేడు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం రాయికల్ మాట్లాడారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బీఆర్ఎస్ హయాంలో మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామంటూ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హయాంలో అప్పటి టీటీడీ బోర్డు మెంబర్ విద్యాసాగర్ రావు నిధులు మంజూరు చేశారన్న విషయం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మర్చిపోయారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మహిళా మండల అధ్యక్షురాలు రాచమడుగు స్పందన, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, బర్కం మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ధర్మపురి: నిరుద్యోగులైన యువతీ యువకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్-కరీంనగర్-నిజామాబాద్-మెదక్ నియోజకవర్గాల గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆశావహుడు రాపాల రాజు అన్నారు. ధర్మపురి పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం నిరుద్యోగులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు. ఈసందర్భంగా నిరుద్యోగ పట్టభద్రులకు వ్యక్తిత్వ వికాస నైపుణ్యం, ఉద్యోగ సాధననై మార్గనిర్దేశం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ బరిలో ఉంటానని అందుకు నిరుద్యోగ యువతీ యువకులు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు

కోరుట్ల: పట్టణంలోని వాసవి కల్యాణ భవనంలో ఆదివారం కోరుట్ల ఆవోపా ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు లింబాద్రి, ఆవోపా కోరుట్ల అధ్యక్షుడు కోటగిరి మహేశ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట శివారుల్లో జగిత్యాల–ధర్మపురి జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంను కారు ఢీకొనగా ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై సధాకర్ కథనం ప్రకారం హబ్సీపూర్ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీకాంత్ తన టీవీఎస్ చాంప్‌పై జగిత్యాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా తిప్పన్నపేట శివారుల్లో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొనడంతో శ్రీకాంత్ తలకు బలమైన గాయాలు తగిలాయి. స్థానికులు 108 ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స తరలించారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థికసాయం

మెట్‌పల్లి: మండలంలోని జగ్గాసాగర్ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కోగుల రవిబాబు ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం రూ.1లక్ష ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో చిన్నయ్య, మల్లారెడ్డి, వేణుగోపాల్, ఆనంద్, అమర్నాథ్‌రెడ్డి, సుధాకర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల హామీల అమలు బోగస్

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల హామీల అమలు బోగస్ అని బీఆర్ఎస్ నాయకుడు తోట్ల మహేందర్ అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండలంలోని గుండంపల్లిలో గ్రామపంచాతీ కూడలి వద్ద ప్రభుత్వ ఆరు గ్యారంటీల కరపత్రాన్ని ఆయన దహనం చేశారు. ప్రభుత్వం ప్రజలకు, రైతులకిచ్చిన హామీలన్నింటిని షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌కు ఎస్సై ఎంపిక

మేడిపల్లి: రాష్ట్ర పోలీస్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొట్టమొదటి డ్యూటీ మీట్‌కు మేడిపల్లి ఎస్సై శ్యామ్ రాజ్ ఎంపికయ్యారు. డ్యూటీ మీట్‌లో రాష్ట్ర పోలీసులకు సైంటిఫిక్ దర్యాప్తుకు సంబంధించి ఐదు విభాగాల్లో ఫింగర్ ప్రింట్, హ్యాండ్లింగ్ లిఫ్టింగ్ ప్యాకింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ మెడిసిన్, క్రిమినల్ లాస్ కి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. జిల్లా నుంచి ఎస్సై పాల్గొన్నారు.

ముత్యంపేట బజరంగ్ సేన కార్యవర్గం

మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామ బజరంగ్ సేన నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొనగంటి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడిగా బాలె భగవాన్, గుండోజు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా గౌతమ్‌రాజ్, కోశాధికారిగా బాలె అనిల్, జగిత్యాల రాజు, కార్యదర్శిగా చింతల తాడేం రాహుల్, మీడియా కన్వీనర్లుగా నేరెళ్ల శ్రీనివాస్ మునిగంటి జలంధర్, ప్రచార కార్యదర్శులుగా చింతల తాడెం సాయితేజ, చింతల తాడెం ఆదర్శ్, అక్షయ్, కంపల్లి నాగరాజు, పొనగంటి రమేశ్, ఉదారపు రమేశ్, గౌరపల్లి కార్తీక్, గౌరపల్లి రాజు, చింతల తాడెం రాజును ఎన్నుకున్నారు.

బీసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రోజా

కోరుట్ల: బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోరుట్లకు చెందిన న్యాయవాది రాజకొండ రోజా నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆదేశాలతో రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ రాచకొండ రోజాను నియమించారు. ఈ సందర్భంగా రోజాను జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, ఉపాధ్యక్షుడు మారిశెట్టి సూర్యప్రకాశ్ అభినందించారు.

బీసీ జాగృతి కార్యదర్శిగా పూర్ణచందర్

సారంగాపూర్: బీసీ జాగృతి సేనా బీర్‌పూర్ మండల ప్రధాన కార్యదర్శిగా కండ్లపల్లి గ్రామానికి చెందిన గంగాధర్ పూర్ణచందర్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా తన నియామకానికి కృషిచేసిన మండల శాఖ అధ్యక్షుడు తోట నరేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలోని హైస్కూల్ పూర్వ విద్యార్థులు 2007–08 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వీరందరూ 16 ఏళ్లకు కలుసుకున్నందుకు ఒకరినొకరు పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకుని సంబర పడ్డారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో లింగారెడ్డి, శ్యాంసుందర్, శరత్, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమారంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని మహాత్మా విద్యానికేతన్‌లో చదువుకున్న 2000–01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కోరుట్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్న నాటి చిలిపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటాపాటలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు చావ్ల లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నిర్మల, తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలపై తప్పుడు ప్రచారం

జగిత్యాలటౌన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామంటూ దరఖాస్తు చేసుకోవాలని ఒక జర్నలిస్టు యూనియన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని టీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య కోరారు. జర్నలిస్టులను పక్కదారి పట్టించేందుకు ఆ యూనియన్ నాయకులు చేస్తున్న చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. యూనియన్ చేస్తున్న అనధికారిక కార్యకలాపాలకు మీడియా అకాడమీ చైర్మన్ మద్దతు ఇవ్వడాన్ని ఆయన తప్పు పట్టారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీయూడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ద్యావర సంజీవ రాజు, జిల్లా అధ్యక్షుడు నల్లాల జయపాల్, కోశాధికారి శ్రీనివాస్, ఆముద లింగారెడ్డి,కాంతారావు తదితరులు పాల్గొన్నారు.